## క్లుప్తంగా

### బూర నర్సయ్యగౌడ్ గెలుపే లక్ష్యం

**బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్**

**యాచారం:** భువనగిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని యాచారం మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామాల్లో ప్రతి బూత్ స్థాయిలో ఎంపీ అభ్యర్థికే అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా పని చేయాలన్నారు. అనంతరం యాచారం గ్రామానికి చెందిన దేవరకొండ ఈశ్వర్‌ను మండల ఉపాధ్యక్షుడిగా, మొగుళ్లవంపు గ్రామానికి చెందిన నారిమళ్ల రమేష్‌ను మండల కార్యదర్శిగా, నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన వంగూరి జంగయ్య యాదవ్‌ను కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### మైసిగండి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే



పూజలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**కడ్తాల్:** మైసిగండి మైసమ్మ ఆలయాన్ని శుక్రవారం అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఆలయ, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం

**ఆమనగల్లు:** కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గం బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సమావేశం శనివారం కల్వకుర్తి పట్టణంలోని ఎన్నికల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు పొనుగోటి అర్జున్‌రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి నియోజక వర్గంలోని అన్ని మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



వెంకటాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

**తలకొండపల్లి:** వెంకటాపూర్‌కు చెందిన ఎంపీటీసీ గౌరిరెడ్డి సునీత భర్త సుదర్శన్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి వెంకటాపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, శ్రీశైలంగౌడ్, శతాబ్ది టౌన్‌షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాసురెడ్డి, బాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌యాదవ్, శేఖర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### దైవ చింతనతో ప్రశాంతత



పూజలో పాల్గొన్న తండావాసులు

**ఆమనగల్లు:** దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ నాయకుడు రవీందర్‌నాయక్, మేడిగడ్డ తండా మాజీ సర్పంచ్ అమర్‌సింగ్ పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాలో దాతల సహకారంతో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణంలో భాగంగా ముఖద్వారం ఏర్పాటునకు శుక్రవారం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దైవ కార్యక్రమాలతో లోక కల్యాణం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో తప్పకుండా ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేశ్‌నాయక్, నరేశ్‌నాయక్, మల్లేశ్‌నాయక్, శంకర్‌నాయక్, పాండునాయక్, ఈశ్వర్, శంకర్, తార్య, సురేశ్‌నాయక్, పరమేశ్వర్, మణిపాల్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- నేడు కార్నర్ మీటింగ్
- పలు గ్రామాల్లో సభలు, రోడ్‌షో
- పాల్గొననున్న ఎంపీ అభ్యర్థి మల్లు రవి, మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్



కడ్తాల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**కడ్తాల్:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపే లక్ష్యంగా నిర్వహించనున్న ప్రజా కార్నర్ మీటింగ్‌లను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ శ్రేణులను కోరారు. శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గంలోని మండల కేంద్రంలో నిర్వహించనున్న ఈ సభకోసం పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలందరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు చేరుతున్నాయని గుర్తు చేశారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారని తెలిపారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఉమ్మడి పాలమూర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాలతో పాటు, రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. విజయమే లక్ష్యంగా ఎంపీ అభ్యర్థి మల్లు రవి పార్టీ నాయకులతో కలిసి శనివారం నియోజకవర్గంలోని జూపల్లి, ఇర్విన్, మాడ్గుల్, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి తదితర మండల కేంద్రాలతో పాటు, గ్రామాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించనున్నట్లు, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్అలీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు శేఖర్‌గౌడ్, వేణుగోపాల్, జహంగీర్ అలీ, బిక్షపతి, రామకృష్ణ, అశోక్, ప్రభు, అజ్గర్‌అలీ, ఆనంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**తలకొండపల్లిలో..**

**తలకొండపల్లి:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పడకల్ గేట్ నుంచి ర్యాలీగా తరలి మండల కేంద్రానికి చేరుకుంటుంది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌లు హాజరువుతున్నారని ఆయన తెలిపారు. పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు:** కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజక వర్గ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. కల్వకుర్తి నియోజక వర్గంలోని జూపల్లి, ఇర్విన్, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి, ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి మండల కేంద్రాల్లో ప్రచార సభలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లురవి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ పాల్గొంటారని తెలిపారు.

# తాగునీరు అందించడమే ధ్యేయం

**కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వర రెడ్డి**



చెన్నారెడ్డి గూడ గ్రామంలో వాటర్ ఫిల్టర్ ప్రారంభించిన అభిషేక్‌రెడ్డి తదితరులు

**మంచాల:** ప్రజలకు తాగు నీరు అందించడమే ధ్యేయమని కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ కుకుడాల వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వీఆర్‌వన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నారెడ్డి గూడ, లోయపల్లి గ్రామాల్లో వాటర్ ఫిల్టర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం సంతోషాన్నిస్తుందన్నారు. మంచి పనులు చేయడం కోసం ప్రతిఒక్కరూ ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, చంద్రయ్య, హన్మంత్‌రెడ్డి, శ్రీను, మోతీరాం నాయక్, అశ్వల బాలరాజ్ ఆయా గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

**ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు**

- పలు గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్



ఇబ్రహీంపట్నంలో ఫ్లాగ్‌మార్చ్

**ఇబ్రహీంపట్నం రూరల్:** లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో రాయపోల్, దండుమైలారం గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు మైబెల్లి, నాగరాజు, కృష్ణారెడ్డి, ఏఎస్‌ఐలు రత్నయ్య, జలంధర్, సీఐఎస్ఎఫ్‌పోర్సు, పోలీసులు పాల్గొన్నారు.

# ఆర్థిక సహాయం అందజేత



ఆమనగల్లు: మృతుని కుటుంబానికి సాయం చేస్తున్న నాగిళ్ల జగన్



చీపునుంతల్లో నగదు సహాయం చేస్తున్న నాయకులు

**తలకొండపల్లి:** చీపునుంతలకు చెందిన నర్సమ్మ ఇటీవల మృతిచెందింది. శుక్రవారం జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు బాల కుమార్‌గౌడ్‌లు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ రూ. 3వేలు, శ్రీనివాసుయాదవ్, రూ. 3వేలు, బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో బాలకుమార్ గౌడ్ రూ. 3,500లు సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, నరోత్తమ్ రెడ్డి, వెంకటయ్య, కుమార్ గౌడ్, తిరుపతి రెడ్డి, బ్రహ్మచారి, చెన్నకేశవులు, రామకృష్ణ, శ్రీరాములు, రాజు, గొస్కిగిరి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లులో..**

**ఆమనగల్లు:** ఉత్తరప్రదేశ్ నుంచి బతుకుదెరువు నిమిత్తం ఆమనగల్లులో నివాసం ఉన్న శివకుమార్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు, స్థానిక నాయకుడు నాగిళ్ల జగన్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేలను మృతుని కుటుంబానికి నాగిళ్ల జగన్ అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యండీ ఇస్మాయిల్, మల్లయ్య, బన్ని తదితరులు పాల్గొన్నారు.

### చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

**ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి**

**చేవెళ్ల:** చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేద్దామని ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఆయన నివాసం వద్ద శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి దంపతులు, వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన బీంభరత్, ఎంపీ రంజిత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల గడ్డ అడ్డాగా ఉంటూ వస్తోందని చెప్పారు. ఈ సారి కూడా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు అందరం కలిసి పనిచేద్దామని చెప్పారు. చేవెళ్ల గడ్డ నాకు రాజకీయం నేర్పించిందని ఇక్కడి ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటానన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుపేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో మద్దెల జంగయ్య, సాయికుమార్, పొట్ట దయాకర్, జనార్దన్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మద్దెల శ్రీను, మల్లారెడ్డి, పెంటయ్యగౌడ్ తదితరులు ఉన్నారు.



# ఓటు వజ్రాయుధంతో సమానం



చుక్కాపూర్‌లో ఓటు హక్కుపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

**ఏపీఎం శ్రీదేవి**

**తలకొండపల్లి:** ఓటు వజ్రాయుధం వంటిదని ఏపీఎం శ్రీదేవి పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. చుక్కాపూర్, ఖానాపూర్, అంతారం, సంఘాయిపల్లి, జంగారెడ్డిపల్లి, పడకల్, జూలపల్లి, వెల్జాల్, తదితర గ్రామాల్లో శుక్రవారం ఓటు హక్కుపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు విలువ ఎంత ముఖ్యమైందో చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఓటును తప్పనిసరిగా సద్వినియోగం చేసుకుంటామని మహిళా సభ్యురాళ్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏపీఎం శ్రీదేవి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటును పారదర్శకంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు మహేశ్వరి, సీసీలు విజయలక్ష్మి, రాములు, సత్యనారాయణ, లక్ష్మయ్య, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో చిరుజల్లు

**యాచారం:** భానుడి ప్రతాపంతో ఎండల తీవ్రత పెరగడంతో ఉక్కపోత ఎక్కువైంది. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, మల్కిజ్‌గూడ, యాచారం తదితర గ్రామాల్లో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొన్ని రోజులుగా ఎండలకు తల్లడిల్లుతున్న ప్రజలకు వాతావరణం కొంత చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు.



నక్కర్తమేడిపల్లిలో కురిసిన జల్లు

## జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలి

**షాద్‌నగర్‌రూరల్:** డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 14న పట్టణంలో నిర్వహించే పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం తాలుకా గౌరవ అధ్యక్షుడు అంచ రాములు అన్నారు. శుక్రవారం పట్టణంలోని దేవి గ్రాండ్ హోటల్‌లో ముదిరాజ్ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంచ రాములు మాట్లాడుతూ మహనీయుల స్ఫూర్తితో ప్రజల్లో చైతన్యాన్ని తీసుకురాడంతో పాటు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముదిరాజులు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమన్నారు. పూలే, అంబేడ్కర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని 14న పట్టణంలో పూలే, అంబేడ్కర్ జయంత్యుత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కేశంపేటరోడ్డు నుంచి ఫరూఖ్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

### నియామకం

**షాద్‌నగర్:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ అధిష్టానం ప్రతి నియోజకవర్గానికి సమన్వయకర్తలను నియమిస్తోంది. అయితే నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గానికి సమన్వయకర్తగా షాద్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డిని నియమిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

### అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

**మాలమహానాడు అధ్యక్షుడు మహేశ్ మాల**



మాట్లాడుతున్న మహేశ్, తదితరులు

**షాద్‌నగర్:** భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు మహేశ్ మాల అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మాలమహానాడు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహేశ్ మాట్లాడుతూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. దేశం అన్ని మతాలు, తెగలు, వెనకబడిన వర్గాలకు సమన్యాయం జరిగేలా వారి హక్కులకు భంగం కలగకుండా ఉండేందుకు రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం అందరు కృషి చేయాలని, ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈనెల 14న నిర్వహించే అంబేడ్కర్ జయంతి సందర్భంగా షాద్‌నగర్‌లో అంబేడ్కర్ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు, ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు నర్సింహా, శ్రీను, మల్లేశ్, శేఖర్, ప్రవీణ్, షణ్ముక ప్రసాద్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



మాజీ మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్యే యాదయ్యను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

**చేవెళ్ల:** మండలంలోని ఊరేళ్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం మూడోరోజు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. హోమాలు, పూజలతో ఊరేళ్ల గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ పూజా కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉండే ఆలయాలతో ప్రజలకు మానసిక ప్రశాంతత లభిస్తోందని చెప్పారు. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని బీజేపీ, కాంగ్రెస్‌ల నాయకులు సైతం వేరువేరుగా ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, గ్రామస్తులు నాయకులను శాలువాలతో సన్మానించారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ నాయకులు, పెద్దలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ తరలిన బీజేపీ నాయకులు



సమావేశానికి వెళ్తున్న నాయకులు

**షాద్‌నగర్‌రూరల్:** లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో పార్లమెంట్ బీజేపీ విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టణం నుంచి పలువురు నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని గడప గడపకూ కేంద్ర ప్రభుత్వ పథకాలను తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీని గెలిపించాలన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలన్నారు. బూత్ స్థాయిలో అందరం కలిసికట్టుగా కష్టపడి పనిచేస్తే బీజేపీ ఎంపీ అభ్యర్థి డికె.అరుణమ్మ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం శ్రీవర్ధన్‌రెడ్డి జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దేపల్లి అశోక్‌గౌడ్, వంశీకృష్ణ, హరిభూషణ్, అశోక్, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రావు, నర్సింహా, లష్కర్‌నాయక్, మోహన్‌సింగ్, చెన్నయ్య, సుధాకర్‌అప్ప తదితరులు పాల్గొన్నారు.